సమస్యల పరిష్కారానికే పిజిఆర్ఎస్: ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం పిజిఆర్ఎస్ ఏర్పాటు చేసిందని జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఎస్‌పి నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌పితోపాటు ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు కూడా పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులతో ఆయన ఫోన్లో మాట్లాడి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులను పోగొట్టుకోవద్దని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఫిర్యాదుదారులకు సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

'మ్యూటేషన్'లో మిలాఖత్..!

నిడమర్రు తహశీల్దార్ కార్యాలయం

- రెవెన్యూ శాఖలో అతిపెద్ద అవినీతి మ్యూటేషన్ ప్రక్రియ
- నిడమర్రు తహశీల్దార్ కార్యాలయమే ప్రత్యక్ష నిదర్శనం
- ఒకే భూమికి రెండు నెలల్లో ఇద్దరికి ఆన్‌లైన్ మ్యూటేషన్
- విఆర్‌ఒ, ఆర్ఐ, తహశీల్దార్ అంతా సూత్రధారులే
- రెవెన్యూశాఖలో అనేక చోట్ల ఇదే తరహా అక్రమాలు
- పిజిఆర్ఎస్‌లో ఉన్నతాధికారుల వద్ద ఘొల్లుమంటున్న బాధితులు
- విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగులోకి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెవెన్యూశాఖలో మ్యూటేషన్ ప్రక్రియ అధికారుల అవినీతికి అడ్డాగా మారుతోంది. లింక్ డ్యాకుమెంట్లు లేకపోయినా, నిబంధనలతో సంబంధం లేకుండా వేరొకరి భూమిని మరొకరి పేరున అడ్డగోలుగా ఆన్‌లైన్ చేస్తూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొంది. ఒక్కోదానికి ఒక్కోలా మామూళ్ల వసూళ్లు సాగుతున్నట్లు తెలుస్తోంది. నిడమర్రు తహశీల్దార్ కార్యాలయంలో ఓ భూమికి సంబంధించిన మ్యూటేషన్ ప్రక్రియలో అక్కడి అధికారులు వ్యవహరించిన తీరే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. తన భూమిని రెండు నెలల వ్యవధిలోనే వేరొకరికి ఆన్‌లైన్ చేసేశారంటూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుడు ఉన్నతాధికారులకు వినతిస్తూ వాపోయాడు. పిజిఆర్ఎస్‌లో అత్యధికంగా రెవెన్యూ సమస్యలు వస్తుండటం ఆ శాఖ అధికారుల వ్యవహర తీరే కారణమని తెలుస్తోంది. మండల కేంద్రం నిడమర్రులో సర్వే నెంబర్ 240-5ఎ, 5బిలో 34 సెంట్లు భూమి ఉంది. సదరు భూమికి చెందిన వ్యక్తి తన మేనమామకు గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేశారు. తర్వాత కుటుంబంలో గొడవలు రావడంతో తాను ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలంటూ 2021 అక్టోబర్‌లో జిల్లా కేంద్రం ఏలూరులోని స్పందన కార్యక్రమంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును భీమవరం జిల్లా రిజిస్ట్రార్‌కు బదిలీ చేసి పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఇక్కడి అధికారులు ఆదేశించారు. దీనిపై పరిశీలించిన రిజిస్ట్రార్ సదరు గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేశారు.

ఆన్‌లైన్‌లో సైతం గిఫ్ట్ డీడ్ డ్యాకుమెంట్ రద్దయినట్లుగా కనిపిస్తోంది. గిఫ్ట్ డీడ్ రద్దవడంతో తనకు సంబంధించిన భూమిని ఆన్‌లైన్ మ్యూటేషన్ చేయాలని 2024 డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని పరిశీలించిన నిడమర్రు రెవెన్యూ అధికారులు జనవరి పదో తేదీన మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేసి పాస్‌బుక్ కూడా జారీ చేశారు. ఆ భూమిపై ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే అప్పుడే సదరు రైతును పిలిచి మాట్లాడి ఇబ్బందులుంటే మ్యూటేషన్ ప్రక్రియను నిలిపివేయాలి. అలా ఏమీ జరగలేదు. డాక్యుమెంట్లు పరిశీలించి విఆర్‌ఒ నివేదిక ఇవ్వడం, తర్వాత ఆర్ఐ, తహశీల్దార్ సైతం ఆ నివేదికను పరిశీలించి మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఇక్కడి వరకూ బాగానే ఉంది. తర్వాత రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కొత్త కథ నడిపినట్లు తెలుస్తోంది.



విఆర్‌ఒ నుంచి తహశీల్దార్ వరకూ అంతా సూత్రధారులే

సర్వే నెంబర్ 240-5ఎ, 5బిలోని 34 సెంట్ల భూమికి మ్యూటేషన్ పూర్తిచేసిన అధికారులు రెండు నెలల వ్యవధిలోనే అడ్డగోలు వ్యవహారం సాగించారు. అదే భూమిని మార్చి 19న మరొక వ్యక్తికి ఆన్‌లైన్ మ్యూటేషన్ చేశారు. అంతేకాకుండా సదరు భూమి యజమాని పేరున వేరొకరి సర్వే నెంబర్లు వేసి అడ్డగోలుగా ఆన్‌లైన్ చేశారు. ఆన్‌లైన్‌లో ఇది చూసిన రైతు వెంటనే తహశీల్దార్‌ను సంప్రదించారు. పరిశీలించిన అధికారులు వెంటనే మీ పేరున మీ భూమి మ్యూటేషన్ చేస్తామని, దరఖాస్తు చేయాలని రైతుకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలోని అధికారి మ్యూటేషన్ ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తిచేయడం సైతం జరిగింది. దాదాపు 20 రోజులకుపైగా గడిచిన తర్వాత దరఖాస్తును తిరస్కరించడంతో సదరు దరఖాస్తు ఆర్‌డిఒ లాగిన్‌లోకే చేరింది. ఇదంతా కావాలనే నిడమర్రు రెవెన్యూ అధికారులు చేసినట్లు స్పష్టమవుతోంది. స్థానిక విఆర్‌ఒ నుంచి ఆర్ఐ, తహశీల్దార్ అంతా కుమ్మక్కై మోసం చేసినట్లు స్పష్టమవుతోంది. మ్యూటేషన్ ప్రక్రియలో జరిగిన అవకతవకలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ఇదే కార్యాలయ అధికారులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకరి పేరున రేషన్ దుకాణం లైసెన్స్ మంజూరైంది. రెండు నెలల్లోనే గుట్టుచప్పుడు కాకుండా వేరొకరి పేరున ఆ దుకాణం మార్పు చేశారు. దీనిపై ఓ ఎంఎల్ఎ జోక్యం చేసుకోవడంతో తమ తప్పును కప్పిపుచ్చుకునేలా మొదట వ్యక్తికే దుకాణం కేటాయించారు. ఒకే భూమికి రెండుసార్లు మ్యూటేషన్ చేయడం వెనుక ఏం జరిగిందో ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. మ్యూటేషన్ ప్రక్రియలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో బాధితులు జిల్లా ఉన్నతాధికారుల వద్దకు క్యూ కడుతున్న పరిస్థితి స్పష్టంగా కన్పిస్తోంది.

ప్రసన్నవెంకటేష్‌కు ప్రతిష్టాత్మక పిఎం అవార్డు

ప్రజాశక్తి - ఏలూరు

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి అవార్డు (2023)ను ఎపిఎం డబ్ల్యుఆర్ఇఐఎస్ సెక్రటరీ వి.ప్రసన్న వెంకటేష్ ఢిల్లీలో ప్రధాని మోడీ సమక్షంలో అందుకున్నారు. సోమవారం 17వ సివిల్ సర్వీస్ డే సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు ఐఎఎస్ అధికారులకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం అందించింది. ప్రసన్న వెంకటేష్ జనవరి 2022 నుంచి జులై 2024 వరకు ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఆయన ప్రజలకు అందించిన సేవలకుగాను ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది. ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు స్థిరమైన అభివృద్ధి, లక్ష్యాల అమలులో భాగంగా మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేశారు. సామాజిక బాధ్యత చొరవ కింద జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో 'అక్షజ' అనే కార్యక్రమంతో గర్భిణులు, ప్రసూతి మహిళల ఆరోగ్య సంరక్షణకు పాటుపడ్డారు. ఈ విధంగా జిల్లాలో సుపరిపాలన అందించడం ద్వారా ఈ అవార్డుకు ఎంపికైన దేశంలోని 10 జిల్లాల కలెక్టర్లలో ప్రసన్న వెంకటేష్ ఒకరు. ఈ సందర్భంగా అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రసన్న వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిచేందుకు ప్రజా సేవకునిగా శక్తివంచన లేకుండా తాను కృషి చేస్తానన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ మోటారు సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - నిడమర్రు



వినతి అందిస్తున్న నేతలు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ముస్లిమ్స్ కమిటీ, సిపిఎం ఆధ్వర్యాన నిడమర్రులో సోమవారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం అక్కడ నిర్వహించిన ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలపై కక్ష కట్టినట్లుగా వక్ఫ్ చట్ట సవరణ చేసిందని విమర్శించారు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా సిగ్గు రాకపోవడం విచారకరమన్నారు. అనంతరం తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత నారపల్లి రమణారావు, ముస్లిమ్స్ కమిటీ నాయకులు ఎమ్‌డి.సాదత్ హుస్సేన్, ఎమ్‌డి.గఫర్‌ఖాన్, ఎమ్‌డి.వాహేద్, ఎమ్‌డి.ఖుద్రూ, రబ్బానీ, ఎస్‌కె.లతీఫ్, ఎమ్‌డి.సాదిక్, సాదిక్, సిపిఎం నేతలు గవర సత్యనారాయణ, కోనా శ్రీనివాసరావు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

పని ప్రదేశాల్లో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధి హామీ కూలీలకు గత ఫిబ్రవరి 1 నుండి నేటికీ వేతనాలు విడుదల చేయలేదని, బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు మండలం మల్కాపురం పంచాయతీ రైల్వేగేట్ వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో నేతలు మాట్లాడారు. అనంతరం కూలీలతో కలిసి బకాయిలు విడుదల చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల వేతనాలను సకాలంలో విడుదల చేయాలని కోరారు. చట్టప్రకారం 15 రోజులకు ఒకసారి వేతనాలు ఇస్తామని చెప్పడం తప్ప నెలలు తరబడి పెండింగ్‌లో పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వాలు చెప్పే దానికి, చేసే దానికి పొంతన లేకుండా ఉందని ఎద్దేవా చేశారు. కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రవాణా ఛార్జీలు పేదల ఖాతాల్లో వేయాలని కోరారు. ఆన్‌లైన్ మస్టర్ పద్ధతిని ఎత్తివేసి, మాన్యువల్‌గానే మస్టర్ వేయాలని కోరారు. బకాయి వేతనాలు సుమారు రూ.62 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, మేట్లు వందలాది మంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: ఉపాధి కూలీల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. సంఘం నేతలు కామయ్యపాలెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు గుడెల్లి. వెంకట్రావు మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుండా ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల పనులు చేపట్టడం ఏమిటని, కూలీల కడుపు నిండేదెలాగని ప్రశ్నించారు. తక్షణం బకాయిలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, పే స్లిప్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం రేకులకుంట, పాలకుంట గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు, టెంట్, తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. కూలీలకు ఇవ్వాల్సిన రవాణా ఛార్జీలు నేటికీ అందలేదన్నారు. ఉపాధి పని చేస్తున్న ప్రతి కుటుంబానికీ రెండొందల రోజుల పని, రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు.

అడిగిన వారందరికీ పని కల్పించాలని వ్యకాస ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు చెరువుల్లో పనులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు యాగంటి సీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, కూలీలకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. పట్టెనపాలెంలో చెరువు పనులు పెట్టకుండా హార్టికల్చర్ పనులు పెడుతున్నారని, కూలీలకు ఉపాధి చూపకుండా ఇతరాలకు సొమ్ము ఖర్చు చేయడం దారుణమని అన్నారు. పంగిడిగూడెం, కేతవరం, నాగులగూడెం, పోలవరం గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించడం లేదన్నారు. అడిగిన అందరికీ చెరువులు, పుంతలు, కాలవగట్లు పనులు కల్పించాలని కోరారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జోడి సూర్యచంద్రం, అందుగుల ప్రభాకరరావు, వామిశెట్టి నరసారావు, కె.సుబ్బారావు, పి.పోతురాజు, వి.అనుమకుమారి, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: వినతి అందిస్తున్న నేతలు, కూలీలు

బతుకు కూల్చారు..!

46 ఇళ్లు నేలమట్టం చేసిన అధికార యంత్రాంగం

62 మందికి పట్టాలిచ్చినా కోర్టు కేసుతోపాటు నివాసయోగ్యంగా లేని స్థలాలు

మరో 53 మందికి అసలు ఇళ్ల స్థలాలే లేవు

శిథిలాల మధ్యే గడుపుతున్న ఎఎస్ఆర్ నగర్ బాధితులు

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన

ఎఎస్ఆర్ నగర్‌లో అధికారులు కూల్చిన ఇళ్లు

ప్రజాశక్తి - భీమవరం

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ నిరుపేదల బతుకులు కూలిపోయాయి. కోటి ఆశల మధ్య సాగుతున్న జీవిత ప్రయాణంలో ఊహించని కుదుపు వారి జీవనాన్ని అతలాకుతలం చేసింది. కాయ కష్టం చేసుకుని ఉన్నదంతా ఊడ్చిపెట్టి అపురూపంగా నిర్మించుకున్న ఇళ్లు కళ్లముందే కూలిపోతుంటే కన్నీరు కారుస్తూ తల్లడిల్లిపోయారు. 46 ఇళ్లు నిర్దాక్షిణ్యంగా కూలగొట్టడంతో రాత్రంతా శిథిలాల మధ్య కంటిమీద కునుకు లేకుండా రోధించిన తీరు వర్ణనాతీతం. సొంతింటి కల చెదిరిపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా తట్టా బుట్టా పట్టుకుని ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్తుండడంతో అందరి హృదయాలు చలించిపోయాయి.

పాలకోడేరు శివారున వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా 1986లో రాజ్ కాలువ గట్టుకు చేర్చి అల్లూరి సీతారామరాజు నగర్ (ఎఎస్ఆర్ నగర్) ఏర్పాటైంది. అప్పట్లో వామపక్ష పార్టీలుగా ఉన్న సిపిఎం, సిపిఐ అనేక పోరాటాలు చేసి నిరుపేదలకు స్థలాలు ఇప్పించి నివాసాలు ఏర్పాటు చేశాయి. కాలక్రమేణా నిరుపేదలు వాటిని ఇళ్లుగా విస్తరించుకున్నారు. సుమారు 108 కుటుంబాలు ఇక్కడే నివసిస్తున్నాయి. వారంతా నిరుపేదలు కావడంతో రూపాయి రూపాయి కూడబెట్టుకుని ఉన్నదంతా ఖర్చు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. సుమారు 40 ఏళ్ల నుంచి ఈ భూమిని నమ్ముకుని ఇంటిల్లపాది జీవనం సాగిస్తున్నాయి. అయితే గత వైసిపి ప్రభుత్వ హయాంలో పాలకోడేరులో ఏర్పాటు చేసిన రెండు ప్రభుత్వ కాలనీల్లో 62 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వీటిలో తొమ్మిది పట్టాలకు సంబంధించి భూమి కోర్టు వివాదంలో ఉంది. మిగిలిన 53 మందికి అసలు ఇళ్ల పట్టాలు లేవు. 62 మందికి ప్రభుత్వం పట్టాలిస్తే కేవలం 14 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. ఏడుగురికి సంబంధించిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. సుమారు 48 మంది ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వ లేఅవుట్‌లో ఉన్న స్థలం కోర్టు వివాదంలో ఉండడం, మరో లేఅవుట్‌లో కనీసం పూడికతీత కూడా జరక్కపోవడంతో నివాసాలకు యోగ్యంగా లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ లేఅవుట్లకు వెళ్లి అసౌకర్యంగా జీవించలేక ఇక్కడే ఉండిపోయారు. అయితే కాలువ కాలుష్యం, అభివృద్ధి పేరుతో ఇళ్లు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టిన నేపథ్యంలో 53 మంది కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు దీనిపై స్టే విధించింది. అయితే 46 ఇళ్లను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేశారు. బాధితులంతా ఎక్కడ నివాసం ఉండాలో తెలియక రాత్రంతా శిథిలాల మధ్యే గడిపారు. కటిక చీకటిలో పాముల భయంతో వృద్ధులు, చిన్నారులతో దోమల మధ్య నరకయాతన అనుభవించారు.

అన్యాయంగా కూల్చేశారు ..

మల్లుల పద్మ, ఎఎస్ఆర్ నగర్ ప్రాంత వాసి

ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నాం. 2020లో ఇళ్ల పట్టా ఇచ్చారు. అప్పట్లో భూమి పూడిక పనులు చేయలేదు. ఇల్లు నిర్మించుకోవాలని ఒత్తిడి తెచ్చారు. ఏం చేయాలో అర్థంగాక మా దగ్గర ఉన్నదంతా ఊర్చి మరికొంత అప్పుచేసి ప్లీట్ బీములు వేశాం. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. ఇల్లు నిర్మించుకునేందుకు డబ్బు లేక ఇక్కడే నివాసం ఉంటున్నాం. అన్యాయంగా ఇల్లు కూల్చేశారు. నాకు ఇల్లు లేదని చెప్పినా వినలేదు.

ఎక్కడికెళ్లాలో అర్థం కావట్లేదు..

మల్లుల వెంకటలక్ష్మి, ఎఎస్ఆర్ నగర్ ప్రాంత వాసి

ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నారు. తినీతినక రూపాయి రూపాయి కూడబెట్టి ఇల్లు ఏర్పాటు చేసుకున్నాం. ప్రభుత్వం ఇళ్ల స్థలం కూడా ఇవ్వలేదు. ఉన్న ఇంటిని కూల్చేస్తే ఎక్కడికి వెళ్లాలో అర్థం కావట్లేదు. ఇంటిని నిర్దాక్షిణ్యంగా కూలదోశారు. అసలు మమ్మల్ని మనుషులుగా గుర్తించట్లేదు.

ఇంత దారుణం ఎక్కడా చూడలేదు..

ఎం.సత్యనారాయణ, ఎఎస్ఆర్ నగర్ ప్రాంతవాసి

40 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. అప్పటి నుంచి లేని ఇబ్బంది ఇప్పుడు ఏమొచ్చిందో తెలియడం లేదు. ఇష్టపడి ఓట్లు వేసి గెలిపిస్తే మాకు సరైన గుణపాఠం జరిగింది. ఇన్నేళ్లలో ఇంత దారుణం ఎక్కడా చూడలేదు. ఉన్న ఇంటిని తొలగిస్తే ఎక్కడికి వెళ్లి బతకాలి. కనీసం ఆలోచన చేయకుండా ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం దారుణం.

పేదల ఇళ్ల తొలగింపులో జిల్లా యంత్రాంగం ప్రేక్షక పాత్ర

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఉండి నియోజకవర్గంలో నిరుపేదల ఇళ్లు తొలగిస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ఒక ప్రయివేటు వ్యక్తి ఆదేశాలిస్తుంటే అధికార యంత్రాంగం పనిచేయడం సిగ్గుచేటు. అసలు జిల్లా కేంద్రంలో జిల్లా యంత్రాంగం పనిచేస్తుందో లేదో కూడా అర్థం కాని పరిస్థితి. కాలుష్యం పేరుతో భూస్వాములకు లబ్ధి చేకూరుస్తున్నారు. ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారు. ఇదే భూమిని ఆక్రమించుకుని వ్యవసాయం చేసుకుంటూ కొబ్బరి చెట్ల ద్వారా ఫలసాయం పొందుతున్న భూస్వాముల ఆక్రమణలు తొలగించరు. నోటీసులు ఇవ్వరు. పేదలకు అన్యాయం భూస్వాములకు న్యాయం చేయడం దారుణం. రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపి ఇళ్లు పోగొట్టుకున్న బాధితులకు అండగా నిలవాలి. ఇళ్ల తొలగింపు లాభసాటి బిజినెస్‌గా మారింది.

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన

ఉండి నియోజకవర్గంలో మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించనున్నారు. ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల్లో బుల్డోజర్లతో దుర్మార్గంగా ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చివేత పర్వం కొనసాగుతోంది. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎటువంటి ఆశ్రయం లేకుండా నిరాశతో ఉన్న బాధితులను పరామర్శించేందుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలతో కూడిన బృందం పర్యటించనుంది. ఈ పర్యటనలో బాధితులను స్వయంగా కలిసి వారి సమస్యలు, ఆవేదనను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి. గోపాలన్ ఒక ప్రకటనలో తెలిపారు.

వాన్స్ గోబ్యాక్

ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన నిరసనలు

వాన్స్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

నినదిస్తున్న రైతులు, నేతలు

ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం మన దేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఎం.నాగులపల్లిలో పాల కేంద్రం వద్ద సోమవారం రైతులు నిరసన తెలిపారు. వాన్స్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు తలొగ్గి, వ్యవసాయ ఉత్పత్తులతో సహా అమెరికా ఉత్పత్తులకు సంబంధించిన సుంకాలు, సుంకంయేతర అడ్డంకులను తగ్గించే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారన్నారు. పంటల ధరల పతనానికి దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, నేతలు గుర్రం రాంబాబు, బోయపాటి సత్యనారాయణ, తూంపాటి మురళీ, పోలుకొండ నాగరాజు, పాడి రైతులు నార్ని సత్యనారాయణ, ముత్యాల వెంకటరావు, మద్దిపాటి సత్యనారాయణ, దొండపాటి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అమెరికా ఉపాధ్యక్షుడు జెడి. వాన్స్ భారతదేశ పర్యటనను వ్యతిరేకిస్తూ వాన్స్ గోబ్యాక్ అంటూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయ సమీపంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి సీతారామయ్య మాట్లాడగా నేతలు సుంకవల్లి శేషగిరిరావు, తాళ్లూరి సూర్యారావు, అనసూయ, పసుపులేటి రోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు మనస్సు పెట్టి పనిచేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలవారీగా స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకుగాను అధికారులకు రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌లో తొలిరోజు కలెక్టర్ వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉభయ జిల్లాల చీఫ్ ప్లానింగు అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది దీనిలో పాల్గొన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా, వార్డు, గ్రామ సచివాలయాల డేటాకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు మనోభావాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్‌కు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెంపు, సుస్థిర, పర్యావరణ అనుకూలమైన వృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగావకాశాలు పెంపుదల, భవిష్యత్తు నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనకు, శ్రామిక శక్తికి ప్రోత్సాహం అందించే క్రమంలో దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గాల వారీగా సమర్ధవంతమైన ప్రణాళికలు అందజేయాల్సి ఉందన్నారు. జిల్లాలోని ప్రతి శాఖ ఈ లక్ష్యసాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు, రానున్న రోజుల్లో అంతరసాగు విధానం, ఆదాయం పెంపు, ప్రకృతి సాగు విస్తీర్ణం పెంపు తదితర అంశాలను ప్రణాళికలో పొందుపర్చాల్సి ఉందన్నారు. పాల ఉత్పత్తి పెంపుదలకు అవసరమైన అంశాలను ప్రణాళికలో పొందుపర్చాలన్నారు. పారిశ్రామిక, పర్యాటక రంగ, ఫుడ్ ప్రొసెసింగు యూనిట్ల స్థాపన వంటి అంశాలను ప్రణాళికలో జోడించాలన్నారు. ఈ వర్క్‌షాపులో ఉమ్మడి జిల్లాల ముఖ్య ప్రణాళిక అధికారులు సిహెచ్.వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, సీనియర్ ఎకనామిక్ సలహాదారులు డివివి.సీతాపతిరావు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు అన్యాయం

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సికి ఆర్డినెన్స్ తీసుకురావాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జైనవారిగూడెంలో సోమవారం నిర్వహించిన ఆదివాసీ గిరిజన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడేరు ఎన్నికల సభలో జిఒ 3కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు దానిని విస్మరించడం దారుణమన్నారు. డిఎస్‌సి ప్రకటన ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించేలా లేదన్నారు. ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి అమలు కోసం నిరుద్యోగ యువత, ఆదివాసీ, గిరిజన, ప్రజాసంఘాలతో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మొడియం నాగమణి, కారం భాస్కర్, కె.సత్యనారాయణ, ఎస్.శ్రీను, ఎం.అనూష తదితరులు పాల్గొన్నారు.

10న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో మే పదో తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. సోమవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

ఉంగుటూరు మండలం బొమ్మిడి పాఠశాల-1 వార్షికోత్సవం ఎస్ఎంసి ఛైర్మన్ ఎర్ర సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు బొమ్మిడి ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. బొమ్మిడి ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బిజెపి మండల నాయకులు దుర్గారావు మాట్లాడారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వెంకటలక్ష్మి, బొమ్మిడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.శ్రీదేవి, జనసేన నాయకులు మద్దాల నాగరాజు, టిడిపి నాయకులు భయ్యే సత్యనారాయణ, యుటిఎఫ్ నాయకులు శీతాల సత్యనారాయణ, వునుముల రాంబాబు, జోగినాయుడు, శ్రీధర్, ఆనంద్, అల్లు శ్రీను, పుప్పాల నరసింహారావు పాల్గొన్నారు.

కుంతలగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాల...

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

కొయ్యలగూడెం : మండలంలోని కుంతలగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకట రమణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు ఆటపాటలతో, నృత్యాలతో అలరించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మిరియాల విజయ్‌ను, డి.శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నత విద్యలో ముందంజలో ఉంటున్నారని రమణక్కపేట జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. రమణక్కపేట జెడ్‌పిహెచ్ పాఠశాల ఉపాధ్యాయులు ఆ గ్రామంలోని ఇళ్లకు వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. ప్రభుత్వం అందించే అమ్మఒడి, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ షకీలా, కనకదుర్గ, మల్లేశ్వరి, శ్రీను, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని పెయ్యేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బేతాళ రాజేంద్రప్రసాద్ అన్నారు. బడికి హాజరు కాని, బడి మానివేసిన (డ్రాప్ అవుట్ చిల్డ్రన్) పిల్లలకు సంబంధించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను పాఠశాలలో జాయిన్ అయ్యేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సోమవారం పెయ్యేరు గ్రామ పరిధిలో పర్యటించి ఇంటింటా సర్వే నిర్వహించి బడికి రాని, బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో జాయిన్ అయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్ మున్నీషా, ఉపాధ్యాయుడు చక్రధర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వ్యవసాయ శాఖాధికారి చాముండేశ్వరి తెలిపారు. నూజివీడులో ఎఒ చాముండేశ్వరి సోమవారం మాట్లాడుతూ మండలంలో 150 ఎకరాల మేర ప్రస్తుతం వరిసాగు కొనసాగుతోందన్నారు. మే మొదటి వారంలో వరి కోతలు ప్రారంభమవుతాయని చెప్పారు. రైతులు ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తూ పోతు రెడ్డిపల్లి, తుక్కులూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పూర్తి వివరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో, వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులు సంప్రదించవచ్చని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు ఢీకొని గాయాలపాలైన వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పోస్టల్ కాలనీకి చెందిన వాకా మీనాకుమారి (62) సోమవారం ఉదయం పోస్టల్ కాలనీ వద్ద రైలు పట్టాలు దాటుతున్న సమయంలో గుర్తు తెలీని రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఆమెను స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం రైల్వే పోలీసులు బంధువులకు అప్పగించారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలప అక్రమ రవాణా : ట్రాక్టర్ సీజ్

టి.నరసాపురం :మండలంలోని మర్రిగూడెం అడవిలో నుంచి అటవి కలప అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న సంఘటన మండలంలోని గట్టుగూడెం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గట్టుగూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవిలో కలపను గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారని గుర్తించిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ అధికారులు దాడి చేసి ట్రాక్టర్ కలప తరలిస్తుండగా ట్రాక్టర్‌తో ఉన్న కలపను స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని మక్కినవారిగూడెం బీట్ గార్డు చలం తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ముసునూరు :నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడులో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో పామర్తి రాధ అనే మహిళ వద్ద ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, ఆమెకు సారా సరఫరా చేస్తున్న మండలంలోని సుంకొల్లు గ్రామానికి చెందిన కొనకళ్ల కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు.

చేపల మేత దొంగలు అరెస్టు

ఉంగుటూరు:సీతారామపురంలో చేపల చెరువు గట్టు మీద మేత బస్తాలను దొంగిలించిన కేసులో అదే గ్రామానికి చెందిన హరికృష్ణ, సహదేవుడు, వెంకట కుమార్, ధనుష్, పవన్ కుమార్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్ వెల్లడించారు. చేపల చెరువు రైతు నడిపల్లి రామాంజనేయవర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టులు చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నిర్వాసితుల సమస్యలు తీరేనా..!

రేషన్ బియ్యం కోసం కొండరెడ్డి గిరిజనుల అవస్థలు

రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు అవ్వక ఇబ్బందులు

సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూపు

నేడు బుట్టాయగూడెంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వంలోని జనసేన తరపున రెండో స్థానం వ్యక్తిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అత్యధిక శాతం పేద, నిరుపేదలు ఉండే పోలవరం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసి నిరాశ్రయులుగా మిగిలి ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ కోసం ఎదురుచూస్తున్న నిర్వాసిత కుటుంబాలు పోలవరం నియోజకవర్గంలోనే ఉన్నాయి. కోయ గిరిజనులు, కొండ రెడ్డి గ్రామాల ప్రజలు ఈ ప్రాంతంలోనే అధికంగా నివసిస్తున్నారు. కొండరెడ్డి ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకునే నాయకుడే కరువయ్యాడు. పౌర సరఫరాల శాఖ ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకోవడానికి కొండ రెడ్డి గిరిజనులు ఐదు నుంచి పది కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంలో కొండరెడ్డి గిరిజన ప్రజలు పడుతున్న సమస్యల పరిష్కారం కోసం గ్రామాలకు సరైన రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలి. అదేవిధంగా ఈ ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్న సమస్య రేషన్ కార్డు ఎడిటింగ్, డిలేటింగ్, యాడింగ్. కొత్తగా పెళ్లి అయిన వారు, పుట్టిన పిల్లలు, చనిపోయిన వారి పేర్ల చేర్పులు మార్పులు చేయడం కోసం ప్రజలు నిత్యం సివిల్ సప్లై అధికారుల చుట్టూ, సచివాలయల చుట్టూ, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి అలసిపోతున్నారు. అధికారులు సర్వర్ పనిచేయడం లేదని చెప్పి సరిపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఎందుకు ఈ సర్వర్ సమస్యలు పరిష్కరించడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పోలవరం నియోజకవర్గంలో గిరిజన, కొండరెడ్డి ప్రజల సమస్యలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతాయని వారు ఎదురుచూస్తున్నారు.

దూరం నడిచి వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్న ప్రజలు (ఫైల్)

సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి

తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

మారుమూల కొండరెడ్డి గ్రామాల్లో నివసిస్తున్న కొండరెడ్డి, గిరిజనులు రేషన్ బియ్యం తీసుకునేందుకు పడుతున్న కష్టం వర్ణనాతీతం. అంతే కాకుండా బియ్యంతో పాటు పప్పు, నూనె సరఫరా చేయడంలేదు. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి. ఆధునిక ప్రపంచంలో ఇంకా గిరిజన, కొండరెడ్డి ప్రజలు రేషన్ బియ్యానికి, విద్యకు, వైద్యానికి అందనంతా దూరంలోనే ఉన్నారు.

ఏజెన్సీలో నేడు, రేపు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పర్యటన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 22, 23వ తేదీల్లో ఏజెన్సీలో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఏలూరు నుంచి బయలుదేరి 10.30 గంటలకు బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం చేరుకుంటారు. పల్లపూరు, తూటికుంట, ములగలగూడెం, పైడాకుల మామిడి, తెల్లవరం పునరావాస కాలనీల్లోని 103 కుటుంబాలకు ఎఎవై కార్డులు అందిస్తారు. అనంతరం 12 గంటలకు రౌతుగూడెం చేరుకుని పునరావాస కాలనీలోని పేదలకు ఎఎవై కార్డులు అందిస్తారు. అనంతరం 1.15 గంటలకు బర్రింకలపాడు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు చంద్రన్న కాలనీ చేరుకుని పేదలకు ఎఎవై కార్డులు అందిస్తారు. అనంతరం మీడియాతో మాట్లాడి రాత్రికి కోటరామచంద్రాపురంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. 23వ తేదీ ఉదయం 9.30 గంటలకు బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెం చేరుకుని గిరిజనులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం 11 గంటలకు బుట్టాయగూడెంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో చిల్లి మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. మంత్రి మనోహర్ పర్యటనపై స్థానిక ఐటిడిఎ పిఒ కార్యాలయంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ రాములునాయక్, బుట్టాయగూడెం తహశీల్దార్ చలపతిరావు, జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు గడ్డమనుగు రవి, కరాటం సాయి చంద్రమోహన్, ఐటిడిఎ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ప్రిన్సిపల్ జడ్జిగా శ్రీదేవి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా న్యాయస్థానానికి జిల్లా ప్రిన్సిపల్ జడ్జిగా సిరిపురం శ్రీదేవి నియమితులయ్యారు. ఆమెను ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాం అందించారు. ఈ సందర్భంగా ఆమె ఎస్‌పితో మాట్లాడుతూ పోలీసు శాఖ న్యాయ శాఖ సంయుక్తంగా పనిచేసి నిందితులకు శిక్షలు పడేవిధంగా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ పాల్గొని ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందించిన వినతుల్లోని సమస్యలను సకాలంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. పరిష్కారం కాని సమస్యలను అర్జీదారులకు వివరించనున్నట్లు చెప్పారు.

పాఠశాలలకు ల్యాబ్ పరికరాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎంపీ నిధులు రూ.నాలుగు లక్షల విలువైన ల్యాబ్ పరికరాలను ఇటీవల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అందించినట్లు ఎంపీ కార్యాలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలకు ఇచ్చిన పరికరాల్లో 250 వరకు భౌతిక, రసాయన, గణిత, సామాజిక శాస్త్రాల ల్యాబ్ పరికరాలు ఉన్నాయని తెలిపారు. మరో విడతలో మిగిలిన పాఠశాలలకు పరికరాలను అందించనున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం వేగివాడలోని ఎస్‌టి కాలనీలో శనివారం స్థానిక కాలనీ ప్రజల కోరిక మేరకు సత్వరమే కంప్రెషర్లను, జెసిబిలను ఉపయోగించి డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించడంతో పాటు రోడ్డు నిర్మించాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాలనీలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ఉదయం ఎంఎల్ఎ పరిశీలించారు. ఈ సందర్భంగా సత్వరమే తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసి అండగా నిలిచిన ఎంఎల్ఎకు స్థానిక కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సారారహిత జిల్లా కోసం కృషి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నవోదయం 2.0 కార్యక్రమంలో సారా రహిత ప్రాంతంగా జిల్లాను తీర్చిదిద్దనున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కెబిఎన్.నాగప్రభుకుమార్ తెలిపారు. నూజివీడు వచ్చిన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సారా తయారీ, క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. నూజివీడు స్టేషన్‌ను నాటు సారా రహిత స్టేషన్‌గా మే 31 లోపు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి ద్విచక్ర వాహనదారుడూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చింతలపూడి సిఐ సిహెచ్.రాజశేఖర్ తెలిపారు. చింతలపూడి డిగ్రీ కాలేజీ వద్ద విద్యార్థులకు, ప్రజలకు హెల్మెట్ ధారణ వల్ల కలిగే ఉపయోగాల గురించి చింతలపూడి ఎస్ఐ కుటుంబరావుతో కలిసి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజశేఖర్ మాట్లాడుతూ పోలీసులు తనిఖీలు చేసినప్పుడు సరైన పత్రాలు చూపించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు స్వాగతం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పరింపూడి ప్రాథమిక పాఠశాల ఐదో తరగతి విద్యార్థినులను జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరో తరగతిలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోమవారం జెడ్‌పి బాలికోన్నత పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఉమాదేవి ఆధ్వర్యంలో వేడుక ఘనంగా నిర్వహించారు.

ప్రిన్సిపల్ శంకరరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రిన్సిపల్ శంకరరావు సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల రిటైర్డ్ రీజనల్ డిప్యూటీ సెక్రటరీ డి.చినవెంగయ్య అన్నారు. మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్న ప్రిన్సిపల్ డివిఎస్‌బి.శంకరరావును పాఠశాల సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా శంకరరావు అంకిత భావంతో పనిచేశారని, అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని ఆయన తెలిపారు. ఆయన సారథ్యంలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సన్మాన గ్రహీత శంకరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. విద్యార్థులకు బాల్య దశలో నేర్పిన క్రమశిక్షణ వారి జీవితాంతం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్స్ రామచంద్రరావు, రాజేంద్రప్రసాద్, నరేష్, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, రామారావు, శ్రీధర్, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేత దారుణం

చేతివృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కమిటీ కన్వీనర్ ఆదిశేషు, కో-కన్వీనర్ కృష్ణారావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భీమవరం జిల్లా పాలకోడేరు గ్రామం ఎస్ఆర్ నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి 42 నిరుపేదల ఇళ్లను పోలీసులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చేతివృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కమిటీ కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో-కన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిరుపేదలు అధికారులను బతిమలాడినా కనికరించకుండా, వంట కూడా చేసుకొనియకుండా భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఈ కూల్చివేతను అడ్డుకోకుండా ముందుగానే సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి ఆశ్రియాలను గృహనిర్బంధం చేశారని, పేదల వద్దకు వెళ్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణను మార్గంమధ్యలో ఆపి భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వారు తెలిపారు. ఒక్కొక్క ఇంటి వద్ద పది మంది నుంచి 15 మంది పోలీసులను కాపలా పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినట్లు వారు తెలిపారు. గృహ నిర్బంధానికి గురైన నాయకులను వెంటనే విడుదల చేయాలని, దౌర్జన్యానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దళితుల గ్రామ బహిష్కరణ హేయం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల సామాజిక హక్కుల వేదిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

పిఠాపురం నియోజకవర్గంలో దళితుల గ్రామ బహిష్కరణ హేయమైన చర్య అని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల సామాజిక హక్కుల వేదిక చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టివిఎస్.రాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తనను గెలిపిస్తే దేశం మొత్తం పిఠాపురం వైపు చూసేలా చేస్తానని 2024 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు నిజం చేశారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పల్లం అనే గ్రామంలో అగ్ర సామాజిక తరగతికి చెందిన పెత్తందారులు ఆ గ్రామంలోని దళితులందరినీ బహిష్కరించి వారికి ఎవరూ ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని, దుకాణాల్లో సరుకులు కూడా దళితులకు విక్రయించకూడదని నిబంధనలు పెట్టి దేశమంతా పిఠాపురం వైపు చూసేలా చేశారని పేర్కొన్నారు. దళితులపై దాడి చేసిన వారిని బహిష్కరించినవారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు బనాయించి దళితులందరికీ రక్షణ కల్పించాల్సిన నైతిక బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

ప్రజల అభ్యున్నతికి సహకరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పుట్టిన గడ్డకు పెట్టుబడులు పెట్టాలని, తెలుగు ప్రజల అభ్యున్నతికి సహకరించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. లండన్ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లీడ్స్‌లో ఒక ప్రముఖ రెస్టారెంట్‌లో పెట్టుబడిదారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే అవకాశాలు, పెట్టుబడి పెట్టాల్సిన రంగాలు ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు యుకెలోని పెట్టుబడులదారులకు వివరించారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్రంలో సిఎం చంద్రబాబు అమలు చేస్తున్న పి-4 విధివిధానాలు వివరించారు. ప్రత్యేకించి చింతలపూడి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు అవకాశాలు, పరిస్థితులపై, రవాణా సౌకర్యాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు

నూజివీడు టౌన్ :తాగునీటి ఎద్దడి నివారణకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించి పైపులైన్ల ఏర్పాటు, కుళాయిల మరమ్మతులు నిర్వహించామన్నారు. ప్రధాన రహదారుల్లో ప్రజల అవసరార్థం దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయా గ్రామాల్లోని సచివాలయాల సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

కృష్ణా నదిలో స్నానానికి దిగి యువకుడు మృతి

బత్తులవారిగూడెంలో విషాదం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

శ్యామ్‌కుమార్ (ఫైల్)

మండలంలోని బత్తులవారిగూడేనికి చెందిన యువకుడు స్నేహితులతో కలిసి సరదాగా విహారయాత్రకు వెళ్లి కృష్ణా నదిలో గల్లంతై మృతి చెందాడు. వివరాల ప్రకారం.. బత్తులవారిగూడేనికి చెందిన పావులూరి ప్రభాకరరావు కుమారుడు పావులూరి శ్యామ్‌కుమార్ (20) ఆదివారం స్నేహితులతో కలిసి ఎన్‌టిఆర్ జిల్లా గుంటుపల్లి రేవు వద్ద విహారయాత్రకు వెళ్లాడు. కృష్ణా నదిలో స్నానానికి దిగిన శ్యామ్‌కుమార్ గల్లంతవ్వడంతో అతని స్నేహితులు స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వగా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం శ్యామ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శ్యామ్‌కుమార్ మృతితో బత్తులవారిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్యామ్‌కుమార్ ఐటిఐ చదివి, అప్రెంటిస్ పూర్తి చేసి విజయవాడలో ఉద్యోగం చేస్తున్నాడు.

ప్రత్యేక బృందాలతో అడ్మిషన్ల ప్రక్రియ

ఎంఇఒ జమలయ్య

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రానున్న 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ కోసం ప్రత్యేక బృందాలతో కృషి చేస్తున్నట్లు ఎంఇఒ-2 ఎస్.జమలయ్య తెలిపారు. పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దినట్లు వివరించారు. అడ్మిషన్ల ప్రక్రియ కోసం ఆయా పాఠశాలల ఎస్ఎంసి ఛైర్‌పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యాశాఖాధికారులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి పర్యటిస్తున్నట్లు వివరించారు.

ఆలయ భూముల కౌలుకు 25న వేలం

ప్రజాశక్తి - ముసునూరు

బలివే రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అలివేణి నాగలక్ష్మిదేవి తెలిపారు. మండలంలోని బలివే గ్రామంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయ కార్యనిర్వహణాధికారి, కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో స్వామివారి ఆలయానికి సంబంధించిన వ్యవసాయ భూములకు మూడేళ్ల పాటు కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంఎల్‌సి రాజశేఖర్‌కు అభినందన సభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిగా గెలిచిన పేరాబత్తుల రాజశేఖర్‌కు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని ఏలూరులోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. ముందుగా ఎంఎల్‌ఎను నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వారు ఘనంగా సన్మానించారు. ఎంఎల్‌సి రాజశేఖర్ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని కోరుతూ పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఎంఎల్ఎ చంటికి వినతిపత్రం అందించారు. తప్పకుండా కేసులను ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు : మండలంలో మౌలిక సమస్యలు పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ కోరారు. సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం లంకలపల్లిలో పార్టీ మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షతన గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి సోయం చంద్రరావు, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మున్ని పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు, ఇరగవరం కాలనీకి చెందిన దాకె కస్తూరి అను నాయొక్క **పాస్ పోర్ట్ నెం. W8092972** గల పాస్ పోర్ట్ ఇరగవరం రోడ్డు కాలనీలో ఇల్లు మారుతుండగా మార్గమధ్యలో నా పాస్‌పోర్ట్ పడిపోయింది. చుట్టు ప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

దాకె కస్తూరి
W/o. గంగరాజు
D.No. 3-4-11, తోట వారి వీధి,
ఇరగవరం రోడ్డు కాలనీ
తణుకు - 534211
Cell No: 74168 25170

PUBLIC NOTICE

This public Notice to given. on behalf of my client **Balam Naga raju** S/o Nageswara Rao R/ó Ramannagudem, Tadepalligudem (M), W.G. as follows:

My client lost the link Document of Regd. Gift deed **Doc. No. 4409/2025** i.e. Regd. Settlement deed **5816/2011** of Tadepalligudem S.R.O. and Regd. Sale ded **DOC-No.3974/2007** of Tadepalligadam S.R.O while he was travelling to Tadepalligidem regarding the RCC Building with in extent of sq. **293.5** yards in house site in **R.S.No.83** bearing D.No.1-23. Therefore this public Notice is issued to to all that any body was in possesion of said documents they shall come forward with documentary proof within **3 days** from date of this notice to under signed else of shall seemed that they are no claims oro objections over the scheduled property and transaction will ble proceed with

P.V.N.Veera Bhadrudu
Advocate
Tadepalligudem
Cell:77023 11197

దస్తావేజులు పోయినది

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జువ్వలపాలెం గ్రామ కాపురస్థులు బాలం నాగేశ్వరరావు గారి కుమారుడు బాలం నాగరాజు నాకు ఇచ్చిన సంజాయిషి ప్రకారం:

నా క్లయింటు తన తండ్రిగారు అయిన బాలం నాగేశ్వరరావు ద్వారా స్థిరాస్థి దఖలు దస్తావేజు తేది. 11-04-2025, **Doc. No. 4409/2025** T.P.G S.R.O. ద్వారా తాడేపల్లిగూడెం మండలం, రామన్నగూడెం గ్రామ పంచాయితీలోని **R.S.No. 83** లోని చ.గ.**293.5** గలలోని డోర్ నెం: 1-23 గల **R.C.C. Building** పొందియున్నారు. కొన్నిరోజుల క్రితం అనగా ది. 18-04-2025 తేదిన అవసరం నిమిత్తం తెలిపిన స్థలం యొక్క దస్తావేజులు లింకు దస్తావేజులు **Doc. No. 3974/2007** మరియు **5816/2011** **T.P.G SRO** లను తాడేపల్లిగూడెం తీసుకొని పోవుచుండగా దారి మధ్యలో కోల్పోయారు. కావున ఆ పత్రము ఎవరికైన దొరికిన యెడల అందజేయగలరు.

పమ్మి వి నాగ వీరభద్రుడు
అడ్వకేటు
తాడేపల్లిగూడెం

పురపాలక సంఘ కార్యాలయం, తణుకు

ఆర్.ఒ.సి. నెం.4037/2014-ఎ1 తేది.21-04-2025

టెండర్ కం-బహిరంగ వేలం నోటీసు (మూడవ పిలుపు)

తణుకు పురపాలక సంఘమునకు చెందిన **శ్రీ మహాత్మా జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే సామాజిక భవనము** నెలకు రూ. 27,000/- నెలసరి అద్దె విలువ పై 3 సంవత్సరముల కాలమునకు లీజుకిచ్చుటకు గాను ది. 28-04-2025వ తేది ఉదయం గం॥ 11.00 లకు పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనరు వారిచే గాని, వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని టెండరు కం- బహిరంగ వేలం నిర్వహించబడును.

వ. నెం.	భవనముల లీజుకు	ప్రతిపాదించిన నెల ఒక్కంటికి అద్దె రూ.	డిపాజిట్ రూ.	సాల్వన్సీ రూ.	టెండరు షెడ్యూలు రూ.
1	శ్రీ మహాత్మా జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే సామాజిక భవనము	27,000/-	1,00,000/-	2,00,000/-	200/-

పై భవనము లీజుకు టెండరు
షెడ్యూలు కొనుగోలు ఆఖరి తేదీ: 25/04/2025
టెండరు షెడ్యూలు జారీ చేయు తేదీ: 26/04/2025
టెండరు దాఖలు చేయు ఆఖరు తేదీ: 26/04/2025 సాయంత్రం గం. 4.00 ల వరకు.

టెండరు కం బహిరంగ వేలం లో పాల్గొను వారు టెండరు రేటు నెలసరి అద్దె విలువలతో టెండరు రేటు దాఖలు చేయవలెను. టెండరు షెడ్యూలు లో పాటు డిపాజిట్టు (డి.డి. ద్వారా) మరియు సాల్వేన్సీ దాఖలు చేయవలెను.

బహిరంగ వేలం అనంతరము టెండరుదారులు మరియు పాట దారుల సమక్షములో బహిరంగ వేలం అనంతరము టెండర్లు తెరువబడును. బహిరంగ వేలము లేక టెండర్లు లో దాఖలైన హెచ్చు పాటదారుల అద్దె విలువలు ఖరారు చేయు విషయములో కౌన్సిలు వారి నిర్ణయము కొరకు ఉంచబడును.

ఏకారణము చూపకనే టెండరు కం బహిరంగ వేలమును వాయిదా వేయుట లేక రద్దు పరచు హక్కు కమీషనరు లేక కౌన్సిలు వారు పూర్తి అధికారం కలిగి యున్నారు.

ఇతరవిషయములు వివరములు కార్యాలయ పని వేళలో రెవిన్యూ విభాగములో తెలుసుకొనగలరు.

సం/- **కమీషనర్,** తణుకు పురపాలక సంఘం